క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే సదస్సులు

బేల: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలోని దహెగాం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. దీంతో పాటు బాధిత రైతులు ఇస్తున్న దరఖాస్తులపై మండల తహసీల్దార్ రఘునాథ్‌రావు నుంచి ఆరా తీశారు. బాధిత రైతులు ఈ సదస్సుకు హాజరు కాకపోతే, ఈనెల 20 వరకు నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన బిక్కునాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బోథ్ మండల కేంద్రానికి చెందిన కూరగాయల వ్యాపారి రహీం ఇటీవల బీపీ సమస్యతో అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను సైతం పరామర్శించారు.

ఇంద్రవెల్లిలో భారీ వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మామిడిగూడ, హీరాపూర్, చిత్తబట్ట గ్రామాల మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి.

జనావాసాల్లోకి జాతీయ పక్షి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిత్యనగర్ 170 కాలనీలో జాతీయ పక్షి నెమలి సంచరించింది. దీన్ని చూసేందుకు కాలనీవాసులు తరలివచ్చారు. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. నెమలిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేశారు.

16న స్పాట్ కౌన్సెలింగ్

ఇచ్చోడ: ఈనెల 16న ఇచ్చోడ గిరిజన బాలుర కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి గల విద్యార్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఈనెల 16న ఉదయం 10 గంటలకు కళాశాలలో రిపోర్టు చేయాలని కోరారు. ప్రసుతం కళాశాలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన ఇంటర్ సీట్ల ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సీఈసీలో 12 సీట్లలో ఎస్టీలకు 6, ఓసీ 1, బీసీ 1, ఎస్సీ 1, స్పోర్ట్స్ 1, ఫిజికల్ హ్యాండిక్యాప్ 1, అనాథలకు 1 చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. హెచ్ఈసీలో 17 సీట్లలో ఎస్టీలకు 11, ఓసీ 1, బీసీ 1, ఎస్సీ 1, స్పోర్ట్స్ 1, ఫిజికల్ హ్యాండిక్యాప్ 1, అనాథలకు 1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినిలు సంబంధిత సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రేషన్ డీలర్లకు ఊరట

కైలాస్‌నగర్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. రేషన్ షాపుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల కోటా బియ్యం ఒకేసారి ఇస్తుండగా లబ్ధిదారులు వేర్వేరుగా వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. డీలర్లు కూడా బియ్యాన్ని వేర్వేరుగా తూకం వేస్తున్నారు. దీనికి తోడు రెండు అంగీకార పత్రాల నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో ఒక్కో లబ్ధిదారు నుంచి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకుంటుండగా బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియ కారణంగా లబ్ధిదారులు ఇబ్బంది పడుతుండగా డీలర్లపై పనిభారం పెరిగింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన బియ్యానికి ఒకేసారి వేలిముద్రలు వేసేలా అవకాశం కల్పిస్తూ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేసింది. ప్రస్తుతం మూడుసార్లే వేలిముద్రలు తీసుకుంటుండగా వారికి కొంత ఊరట కలిగింది. బియ్యం పంపిణీ కూడా వేగవంతమవుతోంది.

'రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదు'

సాత్నాల: రైతు ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. గత కొన్ని రోజుల క్రితం పార్డీ గ్రామానికి చెందిన బొడిగ రాజు, సుందరగిరి గ్రామానికి చెందిన కొక్కుల లచ్చన్న, ఆత్మహత్య చేసుకున్న కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది కలిసి రైతు ఆత్మహత్య చేసుకోకుండా అవగాహన కల్పించాలని అన్నారు.

పాఠశాలలు పునః ప్రారంభం


ఇంద్రవెల్లి: విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


తాంసి: పిల్లలతో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు గంభీర్


సాత్నాల: బ్యాండ్ మేళంతో స్వాగతం పలుకుతున్న టీచర్లు

- మొదటి రోజు అంతంత మాత్రమే హాజరు
- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు


ఆదిలాబాద్‌రూరల్: చిన్నారులను పాఠశాలలో చేర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి, నెట్‌వర్క్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. కొన్ని పాఠశాలలో తోరణాలు కట్టి నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదిలాబాద్‌రూరల్ అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు పాఠశాలలో చేర్పించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తువులతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

- తాంసి మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గంభీర్ తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. కూతురు ప్రజ్ఞను నాలుగో తరగతి, కృష్ణను రెండో తరగతిలో చేర్పించాడు.
- భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పాఠశాలను తోరణలతో అలంకరించారు. ప్రైవేటు పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు పూల బొకేలు, బ్యాండ్ మేళంతో స్వాగతం పలికారు.
- సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని నేరడిగొండ మండలం తేజాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మణిలత అన్నారు.

గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు.

- ఉట్నూర్ మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ పాఠశాలలో నోట్ బుక్స్, యూనిఫాంలను పంపిణీ చేశారు. అధికారులు పాఠశాలలను సందర్శించారు.
- ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని తలమడుగు ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్‌రావు అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్‌లు, టెస్ట్ బుక్‌లను పంపిణీ చేశారు. సుంకిడి, తలమడుగు, ఉమ్రీ, కజ్జర్ల, దేవాపూర్, బరంపూర్, ఝరి, ఖోడద్, ఉండం, లింగి,కుచలపూర్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను బ్యాండ్‌మేళంతో స్వాగతం పలికారు.
- జైనథ్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీపాయిగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. సెక్టోరియల్ అధికారి నారాయణ చేతుల మీదుగా నోట్ బుక్స్, బ్యాగులు, వాటర్ బాటిళ్లు అందించారు.
- ఇంద్రవెల్లి మండల కేంద్రంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలను తోరణాలు, బెలున్స్‌తో ముస్తాబ్ చేశారు.


నేరడిగొండ: యూనిఫాం అందజేస్తున్న ఉపాధ్యాయులు


ఉట్నూర్‌రూరల్: హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు



తలమడుగు: మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కేసీఆర్ హయాంలోనే బడులకు పూర్వ వైభవం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే సర్కారు బడులకు పూర్వవైభవం వచ్చిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంఈవో భూమారెడ్డి, ప్రధానోపాధ్యయరాలు పద్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుంటాల ఆశ్రమ బాలికల పాఠశాలలో చదివి ఇటీవల వెలువడిన ఎస్సెస్సీ ఫలితాల్లో డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు రాథోడ్ శృతి(548) పి.శరణ్య (537)లను గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబారామ్‌ను సైతం సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదివి ఎందరో మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పండరీ, సంతోష్, సోమన్న, జగన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం మండల ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యేను మార్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇచ్చోడ ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్షం నీరు నిల్వ ఉండటంతో ప్రజలకు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సాత్నాల: పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ అనిత అన్నారు. గురువారం శాంగ్వి గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత కృషి సంకల్ప అభియాన్, కార్యక్రమంలో మాట్లాడారు. రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. కుమారస్వామి మాట్లాడుతూ వికసిత సంకల్ప అభియాన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకం, సోలార్ ప్యానల్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. కిరణ్ రెడ్డి, ఏఈవో జాహిద్, రైతులు పాల్గొన్నారు.

'మతసామరస్యాన్ని రెచ్చగొడితే చర్యలు'


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: మతసామరస్యాన్ని రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ చర్చి విషయంలో బండారి సంతోష్ అనే వ్యక్తి కావాలని సోషల్ మీడియా గ్రూప్‌లో పోస్టులను ఫార్వర్డ్ చేస్తూ మతసామరస్యాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరించినట్లు తెలిపారు. అతనిపై టూటౌన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ భీమ్‌సింగ్

నేరడిగొండ: కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ కార్యాలయ స్పెషల్ ఆఫీసర్ భీమ్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. గతేడాది కంటే ఈసారి అడ్మిషన్లు 30 శాతం అదనంగా చేపట్టాలని సూచించారు. ప్రతీ లెక్చరర్ లక్ష్యాన్ని నిర్ణయించుకొని అడ్మిషన్లు చేపట్టాలని పేర్కొన్నారు. అదే విధంగా 90 రోజుల ప్రణాళిక తయారు చేసుకొని విద్యార్థులకు విద్య బోధించాలని ఆదేశించారు. సమావేశంలో డీఐఈవో గణేష్ కుమార్, ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, లెక్చరర్లు సుభాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ భీంసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వంద శాతం ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఈవో జాదవ్ గణేష్‌కుమార్, ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. వర్షాకాలం తొలకరి వర్షాలకంటే ముందే పునాది వరకు పనులు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యకరమంలో జల్కే పాండురంగ్, రమణ, విఠల్, సందీప్, గంగాధర్, ప్రభాకర్, సురేశ్, కిషన్, సాయికృష్ణ, చంద్రకళ, నగేశ్ పాల్గొన్నారు.

'గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఇండ్లు మంజూరు కాలేదు'

నేరడిగొండ: గత పాలకుల నిర్లక్ష్యంతోనే పేదలకు ఇండ్లు మంజూరు కాలేదని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్న బుగ్గారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేద కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ కిషన్

భీంపూర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో గురువారం మాట్లాడారు. అపరిశుభ్రమైన నీటితో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. తినే ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా జాగ్రత్త వహించాలన్నారు. అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి, మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, మండల ఆరోగ్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మిక శాఖ, బాలల హక్కుల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం కేఆర్‌కే కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల్ని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అరుగుల అశోక్, వినోద్, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, సీడీపీవో వనజ, సాంబశివ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వెంకట్‌రావుపేట్ కాలనీలో 12 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన పాఠశాలను గురువారం జిల్లా విద్యశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు 30 స్టీల్ ప్లేట్లు, 30 గ్లాసులు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14న రిమ్స్ ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఊరె గణేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. యువత స్వచ్ఛంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.

పుస్తకాల పంపిణీ

బోథ్: మండలంలోని కమిటీ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. వీడీసీ ఉపాధ్యక్షుడు మేర రమణ, గౌరవ అధ్యక్షుడు, మ ల్లెపూల గంగయ్యతో పాటు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నోముల బాపురెడ్డితో పాటు విద్యార్థుల కుటుంబీకుల చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

పేదల విద్యను అడ్డుకునే కుట్ర

ఆదిలాబాద్‌టౌన్: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యను అడ్డుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో మంజూరు చేసిన పనులను గురువారం పరిశీలించారు. బీసీ, మైనార్టీ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు నర్సింగ్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మెట్టు ప్రహ్లాద్, దాసరి రమేశ్, పవన్ నాయక్, ధమ్మపాల్, దయానంద్, జావిద్, యూనుస్ అక్బాని, వసంత్, మహేశ్ పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం


దరఖాస్తు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్


మాన్కపూర్‌లో మాట్లాడుతున్న డీటీ రమేశ్

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్యాంసుందర్ తెలిపారు. గురువారం మండలంలోని యేసాపూర్, బజార్‌హత్నూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్ రెడ్డి, కరుణకర్‌రెడ్డి, మల్లేపూల నర్సయ్య, జల్కే పాండురంగ్, ఇర్ల శివుడు పాల్గొన్నారు.

ఇచ్చోడ: భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ అన్నారు. గురువారం మాన్కపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సదస్సుల ద్వారా భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బోరిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందజేస్తుందన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, పీఎస్సీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పలువురి పరామర్శ


పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలం సాంగిడి, సోన్‌కాస్, గాదిగూడ మండలంలోని పిప్పిరి గ్రామాల్లో గురువారం పిడుగుపాటుతో మృతి చెందిన రైతులు, కూలీల కుటుంబాలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం మృతదేహాలను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు యూనుస్ అక్బాని, తన్వీర్, రాజేష్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పాయల్ శరత్ ఉన్నారు.

రాజ్యాధికారం కోసమే రథయాత్ర

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యం నిర్మించేందుకే మాభూమి రథయాత్ర చేపడుతున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలో గురువారం చేపట్టిన లక్ష కిలో మీటర్ల రథయాత్ర సభలో మాట్లాడారు. అగ్రకులాల పాలనకు చరమగీతం పాడి అణగారిన వర్గాల అధికారం సాధిద్దామని పిలుపునిచ్చారు. నాయకులు అన్నేల లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, శ్రీకాంత్, దేవేందర్, మందుల రమేశ్, పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బోథ్: బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గురువారం బోథ్‌లోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేశారు.